


రైతులు అధైర్య పడొద్దు... చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 20 మే , 2026 | పేజీలు : 06

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం

# రైతుల కళ్లల్లో కన్నీళ్లు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిలువ ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. వర్షాలు పడే పరిస్థితి ఉండడంతో తడిసిపోతుందని భయంతో రైతులు కంటిమీద కునుకు లేకుండా రైతుల కళ్ళల్లో కన్నీళ్లే మిగిలి కేంద్రాల వద్ద కాపలా కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి నుండి 43 లారీలు మాత్రమే తూకం వేశామని ఇప్పటికి సరిపడా లారీలు ఏర్పాటు చేయకపోవడంతో దాన్యం మిల్లులకు తరలింపులో తీవ్రజాప్యం జరుగుతుందని కొన్ని చోట్ల రూపం పూర్తయిన ధాన్యం కూడా రోజులు గడిచిన తరలించకపోవడంతో గన్నీ సంచులు పేరుకుపోయాయి. దీంతో కొత్తగా తీసుకొచ్చే ధాన్యాన్ని నిల్వ చేసేది కూడా స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.





**నాసిరకం గన్నీ బ్యాగులు పంపిణీ పై రైతులు ఆగ్రహం**

ప్రభుత్వ సరఫరా చేసిన గన్నీ బ్యాగులు నాసికంగా ఉన్నాయని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపిన గన్నీసంచులు నాణ్యతలేమితో ఉండడంతో ధాన్యం నింపగానే చినిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు .దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచుల కొరత తో పాటు పంపిణీ చేసిన సంచులు కూడా పనికిరాకపోవడంతో దాన్యం నిలువ చేయడం కష్టంగా మారిందన్నారు. సంచులు చినిగిపోవడంతో ధాన్యం నేలపాలై నష్టపోతున్నారని రైతులు వాపోయారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నాశీరకం గన్నీ బ్యాగులను సరఫరా చేయడం దారుణమని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు.

**అకాల వర్షాలు హెచ్చరికతో రైతుల గుండెల్లో గుబులు**

అకాల వర్షాలు వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు మొదలై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అప్పుల భారం మరోవైపు ప్రకృతి విపత్తులతో రైతన్న ఆదుకోవాలని కోరుతున్నా..ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. గ్రామాల్లో కల్లాల వద్ద ధాన్య రాశులుగా పేరుకుపోయి ఉండగా కనీసం టార్పాలిన్‌లు కూడా అందుబాటులో లేక రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఒక్క వాన పడితే ఏడాది శ్రమ మట్టి పాలు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో రైతులు తమ ధాన్యాని రోడ్ల పక్కనే నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అకాల వర్షాల ముప్పు ముందే తెరిచిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదనీ వద్ద కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

# తల్లీకూతుర్ని హత్య చేసిన నిందితుల అరెస్ట్

### విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అనుముల మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత(45) హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. కుటుంబ భూవివాదాలు, ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా నిందితులు పూర్వ ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. మృతురాలు లావణ్య పేరు మీద ఉన్న సుమారు 5.24 ఎకరాల భూమిని భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో నిందితులు ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితులు తల్లికూతుళ్ల హత్యకు పన్నిన కుట్ర ప్రకారం ఈనెల 17న ఉదయం మృతులు రుద్రాక్షి సుమలత, ఆమె కుమార్తె రుద్రాక్షి లావణ్యలు ఇబ్రహీంపేట గ్రామ శివారులో గల పామాయిల్ తోట వద్దకు పని నిమిత్తం వెళ్లగా నిందితులు అయిన గుర్రం నవీనీత, అంగడి రణుక, గుండ్లపల్లి స్వామి, గుర్రం రమేష్, రుద్రాక్షి మహేష్, నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహాలు ఏడుగురు వారిని వెంబడించి హఠాత్తుగా దాడిచేసి కారం పొడి చల్లి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన నిందితులు హలియా పోలీసులు సాంకేతిక ఆధారాలు, సెల్‌ఫోన్ వివరాలతో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్తులకు హత్య కు ఉపయోగించిన బైక్, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా నిమ్మల శశికళ, నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహాలు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటుమాన్నా రు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ బి.శ్రీనునాయ క్ పర్యవేక్షణలో త్రిపురారం, హలియా ఎస్ఐ లు నరేష్, సాయిప్రశాంత్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కృష్ణ, కోటి, శివ, ముని, వెంకటేశ్వర్లు, రమేష్‌లు నిందితులను పట్టుకున్నారని అన్నారు.

# వారంలోగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తి




సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం

పాతర్లపహాడ్ గ్రామంలోని అరోహి రైస్ మిల్లు సందర్శన

ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఆలస్యం జరగొద్దు



## అండర్ డ్రైనేజ్ సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని సోలిపేట గ్రామంలో హెచ్ఎండిఏ నిధుల ద్వారా మంజూరైన అండర్ డ్రైనేజీ సిసి రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ చిలువేరు పావని ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. హెచ్ఎండిఏ నిధుల ద్వారా వారి గ్రామానికి నిధులు మంజూరు చేసిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాజేశ్వర్ యాదవ్, సింహారెడ్డి, పోచం రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, వార్డ్ మెంబర్లు పూదురి ఆంజనేయులు గౌడ్, స్వామి నాయక్ పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం



**ప్రజాపక్షం/రామన్నపేట :** 20వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని రామన్నపేట జానపదకళాకారుల మండల అధ్యక్షులు కంకల మల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట మండల బాగోతం, భజన, బుర్రకథ డోలు దెబ్బ, బుడగ జంగాల, ఒగ్గు కథ, కోలాటం కళాకారులు, డప్పు కళాకారులు వివిధ కళారూపాల్లో ఉన్న కళాకారులు ఆయా గ్రామాల కమిటీలలో ఉన్న కమిటీ సభ్యులు కార్యవర్గ సభ్యులు ఆలేరులో జరిగే మహాసభలకు అధిక సంఖ్యలో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామశాఖ అధ్యక్షులు బలుగూరి రవి, కార్యదర్శి కొంగరి జంగయ్య, బలుగూరి లింగస్వామి, శ్రీరామోజు నరసింహాచారి, వీసంగాలయ్య, మామిడి మచ్చగిరి పాల్గొన్నారు.

## పరామర్శ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని తేర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు గంగుల సంజీవరెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విషయం తెలుసుకోని సంజీవరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంగాపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరని రఘునాథరాజు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ రంగయ్య గౌడ్, సర్పంచ్‌లు మంత్రి లతా స్వామి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల, నాయకుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చీదెళ్ళ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రణబోతు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి రణబోతు లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భక్తళాపురం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి వెంకటేశ్వర్లు తల్లి కనకమ్మ పరమపదించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరు తమ కుటుంబంతో సమానమన్నారు. వారు కష్టసుఖాలలో ఉన్నప్పుడు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, నాయకులు బెల్లంకొండ శ్రీరాములు, నేరెళ్ళ మధు గౌడ్, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్, దొంతిరెడ్డి సైదిరెడ్డి, చిలుమల గోపాల్‌రెడ్డి, మర్ల కరుణాకర్ రెడ్డి, దండ అరవింద రెడ్డి, మారయ్య పాల్గొన్నారు.


# ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఫెలోషిప్




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్కు ఎంపికైనట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. దేశంలోని ప్రముఖ సైన్స్ అకాడమీలు సంయుక్తంగా అందించే ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్కు యూనివర్సిటీలోని సీఎస్ఈ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్. ధారకేశ్ ఎంపికయ్యాడని తెలిపారు. విద్యార్థికి రూ.25 వేల ఫెలోషిప్ మొత్తాన్ని అందజేయనున్నారని పేర్కొన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీస్ పర్యవేక్షణలో సాధించిన ఈ అద్భుత విజయంపై విజ్ఞాన్స్ విద్యాసంస్థల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి విజయాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

## తహసీల్దార్ ఎదుట మహిళ బైండోవర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎవరైనా నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలుత తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని గోపసముద్రం తండాకు చెందిన మహిళ నాటు సారా తయారు చేయకుండా, విక్రయించకుండా ఉండేలా తహసీల్దార్ పి.శ్రీనివాస్ ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆమెను అదుపులోకి తీసుకోని తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టగా భవిష్యత్తులో మళ్లీ నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన శిక్షలున్నాయని, జైలుకు పంపాల్సి ఉంటుందని తహసీల్దార్ హెచ్చరించారు.



## గ్రామ అభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలో 2కే రన్‌ను గ్రామ సర్పంచ్ ఐలయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గ్రామంలో డ్రైనేజి, వీధి దీపాలు, మురుగు కాలువలు, మంచి నీటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ప్రభుదాస్, డిపివో లింగయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి




**ప్రజాపక్షం/చింతలపాలెం :** తాటి చెట్టుపై విద్యుత్ షాక్ తగలడంతో గీత కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేళ్ళచెరువు మండలం వెల్లటూరు కాలనీకి చెందిన దాసు సైదులు (46) ప్రతి రోజు చింతలపాలెం మండల కేంద్రానికి వచ్చి తాటి చెట్టు ఎక్కి కల్లు గీసేవారు. ప్రతి రోజులాగే తేది.12.05.2026న మంగళవారం మండల కేంద్రంలో ఉన్నటువంటి తాటి చెట్టు ఎక్కగా కల్లుగీసే సమయంలో క్రమంలో కాలుజారగా తాటిచెట్టు పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళారు. చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరిలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం, విద్యుత్ శాఖ వారు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి




**ప్రజాపక్షం/నడిగూడెం:** మారుతున్న కాలనికి అనుగుణంగా ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని తహసిల్దార్ సొంపంగు సూరయ్య కోరారు. మంగళవారం మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో సిరిపొండేషన్ ఆధ్వర్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్యయాత్రను తహసిల్దార్, సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ గందమళ్ల అజయ్ కుమార్ మాట్లాడుతూ వరి కొయ్యలకు కొందరు రైతులు తెలియక నిప్పాంటిస్తున్నారని, దీనివల్ల నేలకు, పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయని, పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గార్లపాటి హరినాథ్, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట శేఖర్‌రెడ్డి, ఆదర్శ రైతులు బజ్జూరి వీరారెడ్డి, అచ్చిరెడ్డి, పల్లా యుగందర్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆరు ట్రాక్టర్లు పట్టివేత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను రూరల్ పోలీసులు పట్టుకున్న సంఘటన మంగళవారం మిర్యాలగూడ శివారులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున తడకమళ్ల కామేపల్లిగూడెం బ్రిడ్జి వద్ద ఆరు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా మూసి నుంచి ఇసుకను నింపుకోని మిర్యాలగూడకు తరలిస్తుండగా అట్టి ట్రాక్టర్లను పట్టుకోని స్టేషన్‌కు తరలించి పట్టుబడిన ట్రాక్టర్ డ్రైవర్లు కామేపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల రాము, నారబోయిన మహేష్, బుచ్చాల సతీష్, పూసపాటి సతీష్, శ్రీరాముల శ్రీను, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కళ్లెం ఎల్లయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మీ కుటుంబానికి మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో మంగళవారం మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర శోభన్, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాల రకాలను చూసి బెంబేలెత్తుతున్న రైతులు




ప్రజాపక్షం/చందంపేట; నల్గొండ జిల్లా చందంపేట మండల వ్యాప్తంగా రైతులు విభిన్న పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో సుమారు 20 కంపెనీల పత్తి విత్తనాలు అందుబాటులో ఉండగా రైతులకు ఏది మంచి కంపెనీ ఏది మంచిది కాదు అని తెలియని అయోమయంలో ఉన్న పరిస్థితి. ప్రతి సంవత్సరం కొత్త కొత్త బ్రాండ్‌ల పేరుతో కొత్త కొత్త రకాల పత్తి గింజలు మార్కెట్‌లోకి వస్తుండడంతో ఏ పత్తి విత్తనాలు కొంటే ఎక్కువ దిగుబడి వస్తుంది అనే విషయం అయి రైతులకు అవగాహన కల్పించే నాధుడే కరువయ్యారు. రైతులు పత్తి విత్తనాలను దుకాణాలలో తీసుకొని వచ్చి విత్తి తీరా మొలకెత్తిన తర్వాత పత్తి దిగుబడి రాకపోవడంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు మార్కెట్‌లో వచ్చే పత్తి కంపెనీలపై నిఘా ఉంచుతూ రైతులకు ఏ పత్తి విత్తనాలు వాడాలి, ఏ విత్తనాలు వాడితే అధిక దిగుబడులు వస్తాయనే దానిపై అవగాహన కల్పించి రైతులు దళారుల నుండి నాసిరకం పత్తి విత్తనాలు కొనుగోలు చేసి మోస పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల వారికోసం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బూరుగడ్డ మాచవరం సర్పంచ్ యరగాని రాధ నాగరాజు అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని బూరుగడ్డ మాచవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు టెంట్‌ను ఏర్పాటు చేసి, మంచి నీటి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను హుజూర్‌నగర్ ఎంపిడివో సుమంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ అందజేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మందిని పనిలో భాగస్వాములను చేపిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ మాదుగుల లక్ష్మి ని శాలువాతో సత్కరించారు.

## సన్‌షైన్ విద్యార్థుల అభినందన



ప్రజాపక్షం/చండూరు: ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో మండల 2వ, 3వ ,5వ ర్యాంక్‌లు సాధించిన చండూరు మున్సిపాలిటీలోని సన్‌షైన్ పాఠశాల విద్యార్థులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి ఆహ్వానించి మండల 2వ ర్యాంక్ సాధించిన చెరుపల్లి శృతి, 3వ ర్యాంక్ సాధించిన చెరుపల్లి హాసిని, 5వ ర్యాంక్ సాధించిన రావిరాల వైష్ణవిని శాలువాతో సన్మానించి మెమెంటోను అందజేసి ఘనంగా సన్మానించారు. కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలలో ఉండాలని చదువుతున్న పాఠశాలకు , కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌కు రైతులకు సబ్సిడీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలో మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని ఉద్యానశాఖ డివిజన్ అధికారి నసీమామెహ్రాన్ అన్నారు. మంగళవారం స్థానిక రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని అనంతరం మాట్లాడారు. 4 సంవత్సరాల వరకు నిర్వహణ కోసం ఒక సంవత్సరానికి ఎకరానికి రూ.4200 అందచేయబడుతుందన్నారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించే క్రమంలో జనుము, జీలుగ విత్తనాలను ప్రతి ఆయిల్ పామ్ మొక్కకు అడుగు దూరం నుంచి పాదుల వరకు వేసుకోవాలన్నారు. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నందిపాడు విత్తనాభివృద్ధి సంస్థ క్షేత్ర మేనేజర్ కృష్ణవేని, ఉట్లపల్లి ఏఈవో గోపి తదితరులు ఉన్నారు.



## బెస్ట్ అవైలబుల్ స్కీంకు ఎస్‌సి విద్యార్థులు దరఖాస్తు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లాలో చదువుతున్న ఎస్‌సి విద్యార్థిని విద్యార్థులు కొరకు 2026/27 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లీష్ మీడియం 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్) విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం తేది.01.04.2026 తర్వాత రూ.1,50,000 లోపు గ్రామీణ ప్రాంతములలో నివసించే వారికి, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతంలో నివసించే వారికి ఉండాలన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రము (మీ సేవచే ధృవీకరణ పత్రము), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రస్తుతము చదువుతున్న పాఠశాల బోనోఫైడ్, రెండు పాసు పోర్ట్ సైజు ఫోటోలతో సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయము నందు దరఖాస్తు ఫారములు పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను తేది.06.06.2026 సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయములో సమర్పించాలని కోరారు. ఈ పథకమునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ సభ్యులలో గతములో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు గానీ, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద గాని చదువుతున్నట్లు అయితే ఇప్పుడు దరఖాస్తు చేసుకునుటకు అవకాశం లేదన్నారు. 1వ తరగతిలో దరఖాస్తు చేసుకొనుటకు తేది.13.06.2020 నుండి 12.06.2021 వరకు గల మధ్య కాలములో జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. దీనికి సంబంధించిన కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో తేది.10.06.2025 ఉదయం 11 గంటలకు డ్రా తీయబడుతుందన్నారు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు.

## పెరిక కుల సంఘం ఎన్నికలు

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట పట్టణ పెరిక కుల సంఘం ఎన్నికలు నిర్వహించగా కుల బంధువులందరూ కలిసి ఏకగ్రీవంగా ఉగ్గే రాజేష్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బుర్రి రవీందర్, గౌరవాధ్యక్షులుగా గరిక సత్యనారాయణ, కోశాధికారిగా కానుగంటి మునిశ్వర్ మరియు కార్యవర్గ సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తిప్పని పరమేష్, కోట సుధాకర్ వారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం ఆ కార్యవర్గ మొత్తాన్ని ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నికైనట్లుగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారు కొమిరిశెట్టి నరసింహులు, కోశాధికారి దాచేపల్లి రాజు, రాజాపేట ప్రధాన కార్యదర్శి



అంకతి బిక్షపతి, ఎన్నారం అధ్యక్షులు మద్ది రమేష్, అరిగ నాగరాజు, బొట్టు నరహరి, గోదాసు అంజయ్య, కోట విజయ వెంకన్న, గట్కు నవీన్, బుర్రి ఉపేందర్, బుర్రి సతీష్, ఉగ్గే మణికంఠ, కుల పెద్దలు కుల బంధువులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశం కోసం దరఖాస్తు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : 2026/27 విద్యా సంవత్సరమునకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్, బేగంపేట్‌లో ఒక్కొక్క ఎస్‌సి విద్యార్థిని విద్యార్థులకు ఒకటవ తరగతి ప్రవేశము కొరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారములను సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం నందు తేది. 15.05.2026 నుండి ఉచితంగా పొందవచ్చన్నారు. అట్టి దరఖాస్తులను ఈనెల 29 సాయంత్రం 4 గంటల వరకు అందించాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు సూర్యాపేట జిల్లాకు చెందిన వారై ఉండాలని, తేది.01.06.2019 తర్వాత 31.05.2020కి ముందు జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధృవీకరణ పత్రము, మీ సేవ మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపల్ బోర్డు, తహశీల్దార్లు నుండి పొందవలెనని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతమునకు చెందిన వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతమునకు చెందిన వారికి రూ.2లక్షల మించరాదని దానిని మీ సేవ ద్వారా పొందవలెనన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక విధానము చేయబడుతుందన్నారు. తేది. 01.06.2026 ఉదయం 11 గంటలకు ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తుతోపాటు నివాస ధృవీకరణ పత్రము, పుట్టిన తేది ధృవీకరణ పత్రం (మీసేవ), కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జతపర్చాలన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలకు, రైతులకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు స్పష్టం చేశారు. మండలంలోని పొట్లపహాడ్ గ్రామం నుండి అన్నారానికి వెళ్లే రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన స్థానిక సర్పంచ్ మేకపోతుల చిన్న లింగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల వేళ ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను చూసి, ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తయితే రైతులకు పంట పొలాలకు వెళ్లడానికి, అలాగే ప్రయాణికులకు దశాబ్దాలుగా ఉన్న రవాణా ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారపు సురేష్, నాయకులు నారాయణ శ్రవణ్ కుమార్ రెడ్డి, రామినేని నవీన్ కుమార్, మేకల నగేష్, నారాయణ రామిరెడ్డి, ఎగ్గడి నాగయ్య, మేకపోతుల సుందర్ పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రజాపక్షం/నడిగూడెం: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.శిరీష అన్నారు. మంగళవారం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరైన 40 లక్షల రూపాయలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డ్ నిర్మాణ పనులను సర్పంచ్ దున్న శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. షెడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమె వెంట జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహాలక్ష్మి, ఎంపిడివో మల్హార్ నాయక్, ఎంపీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఎఈ లావణ్య, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్న లింగయ్య, గుండు మహేందర్‌ప్రసాద్ ఉన్నారు.





## తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐకేపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా మండల అధ్యక్షులు పింగలి విజయ్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోళ్లు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికి కల్లాల్లోనే రైతులు తీసకువచ్చిన ధాన్యం రాసులు దర్శనమిస్తున్నాయన్నారు. వినతి అందజేసిన వారిలో మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సురేష్, సినియర్ నాయకులు నవీన్‌రెడ్డి, బిజెవైఎం నాయకులు సోమరాజు, బూత్ అధ్యక్షులు సురేష్, కిషోర్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలిగా భవాని



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాయపూడి భవాని ఎన్నికైంది. ఈ మేరకు ఆమె మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అందరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రెండు సంవత్సరాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టి ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు.

## 'సర్' మ్యాపింగ్ పనులను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎస్ఐఆర్ మ్యాపింగ్ పనులు నెలాఖరులోగా 90శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో మ్యాపింగ్ 55.85శాతం, మండలంలో 78.5శాతం రెండు కలిపి 70.25 శాతం జరిగిందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 70.23 శాతం మ్యాపింగ్ జరిగిందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మ్యాపింగ్ నిర్వహించి నెలాఖరులోగా పూర్తి చేయాలని కోరారు. తమ పనులు పక్కకు పెట్టి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిటీ ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు అబ్బాస్, కల్పన, జూనియర్ అసిస్టెంట్ శ్రావణిలు ఉన్నారు.



# ఉద్యమకారుల గుర్తింపులో పారదర్శకత పాటించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పూర్వ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అన్నారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వేసిన సందర్భంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పూర్వ టీజేఏసి ఆధ్వర్యంలో ఆనాడు క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొన్న వివిధ రంగాలకు సంబంధించిన ఉద్యమకారులతో మంగళవారం రెడ్ క్రాస్ భవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్న అసలైన ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా గుర్తింపు ప్రక్రియ కొనసాగాలని ఆయన కోరారు.తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూతెలంగాణ ఉద్యమ చరిత్ర, త్యాగాలు, పోరాట స్పూర్తి దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా నిజమైన ఉద్యమకారుల ఎంపిక జరగాల్సిన అవసరం ఉందనీ అన్నారు.ఉద్యమకారులను కనిపెట్టే పని నిజాయితీగా చేయాలని ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చక్రహరి రామరాజు, గోలి అమరేందర్ రెడ్డి, బోనగిరి దేవేందర్, వైద్యుల సత్యనారాయణ,అంబటి నాగయ్య, వీరెల్లి చంద్రశేఖర్,ఇందూరి సాగర్,దూసరి కిరణ్ కుమార్,పందుల సైదులు,పన్నాల గోపాల్ రెడ్డి,పెరిక కరణ్ జయరాజు,రమేష్, శ్రవణ్ కుమార్,నల్ల సోమ మల్లయ్య,వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా కళా పురస్కార అవార్డు గ్రహీత వాకిటి రామ్ రెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/ఆత్మకూరు (యం) :** వలిగొండ మండలం, పులిగిల్ల గ్రామానికి చెందిన ఆత్మీయ భారతి వ్యవస్థాపక అధ్యక్షులు వాకిటి రామ్ రెడ్డి ఇటీవల రవీంద్ర భారతి లో జరిగిన కార్యక్రమంలో ప్రజాకవి పురస్కారం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రానికి చెందిన శ్రీ రామలింగేశ్వర స్వామి నాట్య కళామండలి కళాకారులు రామ్ రెడ్డిని ఘనంగా సన్మానించి విజ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా కవి రామ్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరులో శ్రీ రామలింగేశ్వర స్వామి నాట్య కళామండలి ఏర్పడి 85 సంవత్సరాల అవుతున్నప్పటికీ ఇప్పటికీ కూడా పౌరాణిక నాటక రంగంలో కళాకారులు కలలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నాట్య కళామండలి కళాకారులను రామ్ రెడ్డి సన్మానించి, కూరెళ్ల విఠలాచార్య జీవిత చరిత్ర పై



ముద్రించిన చరితార్థుడు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ భారతి ప్రధాన కార్యదర్శి రెబ్బే మల్లికార్జున్, రామలింగేశ్వర స్వామి నాట్య కళామండలి అధ్యక్షుడు గుండెగాని ఐలయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు పైల పద్మా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, రామలింగేశ్వర స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ పైల్ల దామోదర్ రెడ్డి, కళాకారులు రచ్చ శంకర్, పంజాల నరసయ్య గౌడ్, మాదా రవి, దిగోజు నరసింహ చారి పాల్గొన్నారు.

# రామన్నపేటలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా మూడవ మహాసభలు



**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభలు రామన్నపేటలో స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహపూరితంగా జరిగాయి. ప్రారంభ సూచికంగా జిల్లా అధ్యక్షుడు ఒళ్ళు యాదగిరి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి సరిపడా నిధులు కేటాయించకుండా, పని దినాలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తోందని అన్నారు. ఈ మహాసభల్లో రైతుసంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్,జిల్లా ప్రధానకార్యదర్శి కొండమడుగు నర్సింహా,రాష్ట్ర నాయకులు ములకలపల్లి రాములు, జిల్లాఉపాధ్యక్షులు జల్లెల పెంటయ్య,గంగాదేవి సైదులు,సిర్పంగి స్వామి,గుంటోజు శ్రీనివాసచారి,రాచకొండ రాములమ్మ,సహాయ కార్యదర్శులు సల్లూరి కుమార్,జుకంటి పౌల్,పల్లెర్ల అంజయ్య,కుంకుట్ల చౌక్కా కుమారి,ఆహ్వాన సంఘం అధ్యక్షులు కూరెళ్ళ నర్సింహా చారి,ఈ మహాసభలకు సంఘీభావంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం,రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడి సౌహార్థ సందేశం అందించారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన జడ్పీ సిఇఒ

**ప్రజాపక్షం/బీబీనగర్ ః** మండలంలోని రహీంఖాన్ గూడ గ్రామంలో ఎంఎన్ఆర్ ఈజీఎస్‌లో జరుగుతున్న పనులపై సీఈఓ జెడ్పి సీఈవో శోభారాణి మంగళవారం సందర్శించి కూలీల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరము ఆమె ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బందికి కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ మరియు కూలీల పెంపు పైన అధికారులు దృష్టి పెట్టాలని వారికి కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైస్ శ్రీనివాసరెడ్డి, ఏఈలు రాకేష్ కుమార్, రవి, కిరణ్, కార్యాలయ సూపర్ ఇండెంట్ హరి శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.





## ఉద్యమకారులను సన్మానించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్మానం చేయాలని ఉద్యమకారుల జేఏసీ నాయకులు మారం శ్రీనివాస్, మాలోతు దశరధ్‌నాయక్, రాపోలు పరమేష్, బంటు వెంకటేశ్వర్లు, ఇక్బాల్‌లు కోరారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉద్యమం ఉధృతంగా సాగిన ప్రాంతం మిర్యాలగూడ గుర్తింపు పొందిందన్నారు. కార్యక్మంలో దాసరాజు జయరాజు, విజయ్‌కుమార్, మాశెట్టి కిశోర్, నక్క వెంకటేశ్వర్లు, గురునాదం, కృష్ణమూర్తి, సత్యనారాయణ, చందుయాదవ్, డైమండ్ చిన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్ సోమనర్సయ్యకు ప్రశంసాపత్రం

**ప్రజాపక్షం/గుండాల;** గత రెండు దశాబ్దాలుగా వృత్తికి అకింతం అయి విద్యార్థుల అభివృద్ధికి నిత్యం తోడుగా ఉంటూ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్వీపర్ పారుపల్లి సోమనర్సయ్య 2025/26 విద్యా సంవత్సరంలో అత్యధిక ఎఫ్ఆర్ఎస్ నమోదు శాతం పొందడంతో స్వీపర్ సోమనర్సయ్యకు పాఠశాలల డైరెక్టర్ ఐఏఎవ నవీన్ నికోలస్ ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరిగింది. వృత్తిని నిబద్ధతతో చేస్తున్నందుకు ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎర్ర సుధాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాల మరిన్ని ఉత్తమ మైలురాళ్లను చేరుకోవడానికి ఇలాంటి వ్యక్తుల యొక్క మార్గం అవసరం అని ఆయన కొనియాడారు.

## ధాన్యం కొనమని వేడుకుంటే రైతులపై కేసులా!

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల వ్యాప్తంగా వడ్ల కొనుగోలు జాప్యం జరగడం దేనికి సంకేతం ఇస్తుందని రామన్నపేట మాజీ ఎంపీపీ కన్నబోయిన జ్యోతి బలరాం యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వడ్లుకొనాలని అధికారుల కాళ్ళ వేళ్ళు, ప్రజాప్రతినిధుల కాళ్ళవేళ్ళ పడుతుంటే ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటూ రైతులు వడ్లు కొనమని అధికారులను వేడుకుంటుంటే రైతులపై కక్షపూరితంగా కేసులు పెట్టి బెదిరింపులకు గురిచేయడం వారియొక్క అవివేకానికి నిదర్శనమని, లీడర్లు ఫ్లెక్సీలకే పరిమితమై ఇది నావర్గం అది నా వర్గం అని ఒకరి గుంపుపై మరొకరు కేసులు పెట్టుకుంటున్నారు తప్ప రైతులను ఏ విధంగా రాజులు చేస్తామనే ఆలోచన ఒక్కరికి లేదు.

## వెంటనే కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం అన్నారు. భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్ఆర్ఓ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టి తదుపరి ఎంఆర్ఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజా పాలన కాదు (ఇందిరాపాలన)రాక్షస పాలన అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వైయంతి, సుర్వి శ్రీనివాస్, పట్టణ ప్రదాన కార్యదర్శి ఉడుత భాస్కర్, ఓబీసీ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యులు రత్నపురం శ్రీశైలం, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాలశంకర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జనగాం కవిత పాల్గొన్నారు.





## వారోత్సవాలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా జరిగే జన్‌భాగిదారి సబ్సే దూర్, సబ్సే పహ్లే వారోత్సవ అభియాన్ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. శంకర్ కోరారు. మంగళవారం ఆయన వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఈనెల 18 నుంచి 25 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె. మంగ్యా, సిబ్బంది శాంతికుమార్, ప్రియాంక, శివరాజ్, నాగరాజు, సైదా పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ వరం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోట మహేశ్వరి గణేష్, నల్ల శ్రీరాములు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగిందని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కర్నాకర్, ఉపసర్పంచ్ జిట్టా కిషన్ యాదవ్, నాయకులు దేవరుప్పుల ఐలయ్య, ఎరుకల వెంకటేష్ గౌడ్, దేవరుప్పుల మల్లేష్ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సమావేశం

**ప్రజాపక్షం/ మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు తెలంగాణ సిఈఓ ఆదేశాల మేరకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు తహసీల్దార్ కార్యాలయములో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజాప్రతినిధులు అందరు హాజరు కావాలని మోట కొండూరు తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమం విధి విధా నాల గురించి అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## యువత నైపుణ్యాల పెంపుపై దృష్టి సాధించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు.మంగళవారం నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామ రైతు వేదికలో ప్రజా పాలప్రగతి ప్రణాళికలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్‌పై నకిరేకల్ నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సువీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలుపెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, సుధాకర్, చందుపట్ల సర్పంచ్ దిగోజు లత వెంకటాచారి,పంచాయితీ కార్యదర్శి కత్తుల మధు, ఉపసర్పంచ్ మంజుల శ్రీను,రంగారెడ్డి,వార్డు సభ్యులు జిల్లా నాగయ్య,గంగుల వీరయ్య, పుట్ట నాగయ్య,బిక్షం రెడ్డి పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులోభాగంగా నల్లగొండ పట్టణంలో మంగళవారం విస్తృత స్థాయిలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్‌తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్.శివ శంకర్ రెడ్డి ఆర్‌పీ రోడ్,డీఈఓ కార్యాలయం పరిసరాలు,డీవీకే రోడ్,సాగర్ రోడ్ ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారులు,హోటళ్లు, రెస్టారెంట్లు,బేకరీలు, స్వీట్ షాపులు,ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు, టీ స్టాల్స్, కేఫేలు, మండీలలో తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యాపారులు చికెన్, మటన్ వంటి మాంసాహార పదార్థాలను సరైన లేబులింగ్ లేకుండా, "యూజ్ బై డేట్" నమోదు చేయకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసినట్లు గుర్తించారు. శీతలీకరణ ఉష్ణోగ్రతల నిర్వహణకు సంబంధించిన లాగ్‌బుక్స్ కూడా లేకపోవడం గమనించారు. కొన్ని మాంసాహార పదార్థాలు పూర్తిగా పాడైపోయిన స్థితిలో కనిపించాయి.బేకరీలలో గడువు ముగిసిన బిస్కెట్లు, చాక్లెట్లు, సాస్‌లు ఇతర ఆహార పదార్థాలతో కలిపి నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార భద్రత నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఈ పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేశారు. ఆమన వెంట ఎఫ్ఎస్‌డబ్ల్యూ టెక్నీషియన్ ఎం.వెంకటపతి, డ్రైవర్ పి. వంశీ పాల్గొన్నారు.

## జనగణనలో కుల గణన చేపట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇండియా విప్లవోద్యమ రథసారథి, కులవర్గ పోరాట సిద్ధాంతకర్త, మలి దశ తెలంగాణ ఉద్యమ నిర్మాత మారోజు వీరన్న 28వ వర్ధంతి సందర్భంగా జనగణనలో కుల గణన చేపట్టాలి అనే అంశంపై మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో బహుజన మహాసభ (బిఎంఎస్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. బిఎంఎస్ నల్లగొండ జిల్లా కోకన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ (బీసీపీ) రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కుల గణన తప్పనిసరిగా చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్ని కులాల జనాభా లెక్కలను పారదర్శకంగా వెల్లడించాలని, బీసీలకు చట్టసభల్లో కుల దామాషా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.మేమెంతమందిమో మాకంత వాటా అనే నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, చట్టసభలు మరియు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కుల దామాషా ప్రకారం అమలు చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ జిల్లా కన్వీనర్ చెట్టుపల్లి రామ్ మాదిగ,బొల్లికొండ లింగయ్య యాదవ్,గుత్తా వెంకట్ రెడ్డి,గూడూరు జానకిరామ్ రెడ్డి,చింతమల్ల గురవయ్య,సాగర్, వైద్యుల సత్యనారాయణ,నల్ల సోమల్లయ్య,పగడాల నాగేంద్ర,కవి అంబటి వెంకన్న,దూకుడు లక్ష్మీనారాయణ,పొన్నాల గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మర్రిగూడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చండూరు ఆర్‌డిఓ వి. శ్రీదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయం వంటి కనీస వసతులు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. రైతుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ధాన్యం తూకం, రవాణా, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు,ఏపీఎం వెంకటేశం, ఇందిరా కమిటీ సభ్యులు పద్మ, అనూష, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో జనగణన ప్రచార రథానికి శ్రీకారం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** భారత జనగణన 2027 జనాభా లెక్కల సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార రథాన్ని మంగళవారం మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు.మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన ఎంతో కీలకమని తెలిపారు.ప్రజల సామాజిక,ఆర్థిక, విద్యా, ఉపాధి పరిస్థితులపై సరైన సమాచారం సేకరించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



## ఎరువుల ధరలతో రైతుపై భారం

**ప్రజాపక్షం/నకిరేకల్:** రాష్ట్రంలో యూరియా, డీఏపీ సహా ఎరువుల ధరలు భారీగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో పాటు,ధరలు పెరగడం వల్ల సాగు ఖర్చులు మరింత పెరిగాయని అన్నారు. రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల సరఫరా, ధరల నియంత్రణలో విఫలమైందని విమర్శించారు.బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి ఎరువులు తక్కువ ధరలకు అందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎరువులను అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం ముర్పునూతల గ్రామానికి చెందిన నోముల శ్రీకాంత్ (21) మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతు దు శ్రీకాంత్ భార్య కావ్యల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా కావ్య తల్లిదండ్రులు పలుమార్లు శ్రీకాంత్‌ను దూషించడంతో మనస్థాపానికి లోనైన శ్రీకాంత్ వారం క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించడం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

## ఐటిఐలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ ఐటీఐ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)లో 2026/27/28 సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైంది.ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ (పాత భవనం) ప్రిన్సిపాల్ ఎ నర్సింహ్మా చారి తెలిపారు.నల్లగొండ జిల్లాలోని ఐటీఐ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)లో వివిధ ట్రేడ్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 8 ట్రేడ్లలో 14 యూనిట్లకు అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇందులో ఎన్‌సీవీటీ, రాష్ట్ర ప్రభుత్వ, హాస్టల్ సదుపాయం కలిగిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని,ఇందుకు తెలంగాణ ఐటీఐ అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని,ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు.

## చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్టమైన నిఘా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్టమైన భద్రతా , నిఘా అవసరమని జిలా పశువైద్య శాఖ అధికారి డాక్టర్ జి.వి.రమేష్ తెలిపారు.బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలోని ఆరు చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసు మరియు పశువైద్య సిబ్బందిని 24 గంటల పాటు విధుల్లో నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.చెక్‌పోస్ట్‌ల ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలకు అనుగుణంగా పశువుల రవాణా జరుగుతుందో లేదో పరిశీలించాలని సూచించారు. సరైన పశువైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరెడ్డి, పశువైద్యులు డాక్టర్ రమాదేవి,డాక్టర్ స్వప్న,డాక్టర్ శశికళ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఊట్కూరి లెనిన్‌కు ఒయు డాక్టరేట్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఊట్కూరి లెనిన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. సీనియర్ ప్రొఫసర్ జాడి ముసలయ్య పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర స్థానిక పాలనలో దళితుల రాజకీయ భాగస్వామ్యం నల్లగొండ జిల్లా అధ్యయనం అంశంపై పరిశోధన పూర్తి చేశారు.ఓయూ పరీక్షల విభాగం డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది. నకిరేకల్‌కు చెందిన మారయ్య, ఎల్లమ్మ దంపతుల కుమారుడైన లెనిన్ విద్యార్థి ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆయనను అభినందించారు.

# మున్సిపల్ పాలకమండలి సభ్యులకు సత్కారం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్ పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆమెతో పాటు పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు.ఐదో వార్డు సభ్యుడు శ్రీకాంత్,15వ వార్డు సభ్యురాలు యాసారపు లక్ష్మి వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్,నకిరేకల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య సతీమణి నివాసంలో వారికి ఆత్మీయ సత్కారంని ర్వహించారు.ఈకార్యక్రమంలో వేమవరపు నర్సింహులు,గౌడ సంఘం అధ్యక్షుడు కొండ వెంకన్న,మాచర్ల సైదులు,అనూ పాస్టర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# శౌరీ కుటుంబ సభ్యులకు పరామర్శ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోడిరెక్క శౌరీ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి శౌరీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సీపీఎం నాయకులు శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడిరెక్క మల్లయ్య ఉన్నారు.




# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలి

### ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలోని ఇంద్రాకిలాద్రి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జూలూరు కొనుగోలు కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తరలింపు పరిస్థితులను సంబంధిత అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కేంద్రాల వద్ద ఉన్న రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వినియోగించి ధాన్యం నిల్వ ప్రక్రియ చేపట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రతి రైస్ మిల్లు, ఐకేపీ, ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని గుర్తించారు. హమాలీలు, లారీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని,కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జూలూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాత పార్టీ అని, గత రెండేళ్లుగా ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. జూలూరురుద్రవెల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు రూ.18.5 కోట్లతో ప్రారంభం కానున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్, పోచంపల్లి పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, సివిల్ సప్లై అధికారులు రోజా రాణి, బాలమణి, మార్కెటింగ్ శాఖ అధికారులు, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, పోచంపల్లి తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 40 ఏళ్ల తర్వాత కలయిక




**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985/86 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నాలుగు దశాబ్దాల తర్వాత మెదిపి సారి కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి అల్లరి సంఘటనలను స్మరించుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు.ఈసందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు.ప్రధానోపాధ్యాయులు ముస్కు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కలయికలు స్నేహబంధాలను చిరస్థాయిగా నిలుపుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సాంబశివరెడ్డి, మిట్ట లక్ష్మారెడ్డి,కందకట్ల వెంకటయ్య పోతుల మల్లయ్య,పూర్వ విద్యార్థులు అల్వాలరవి, కొండ శ్రీనివాసులు దుస్స నాగరాజు,బొజ్జ సుందర్, బొజ్జ చిన్నవెంకులు,లకపాకరాజు,సిహెచ్ భాస్కర్ , కాశీరాం,బాబి రెడ్డి గార్లపాటి అరుణ,అనిత తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోల్లు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని ఆమనగల్లు లక్ష్మీదేవి కూడా గ్రామాలలో నిర్వహిస్తున్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి సందర్శించారు రైతులతో కలిసి ధాన్యం రాశులను పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ 50 రోజుల నుండి కొనుగోలు కేంద్రాలలో వడ్లు కొనుగోలు జరగక ఎక్కడి రాశుల అక్కడే ఉండడం బాధాకరమని అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు,కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్వంత్ రెడ్డి,అశోక్ రెడ్డి.గడ్డం వెంకట రెడ్డి,పెదమాం భరత్,జవాజి సత్యనారాయణ,జానకి రామ్ రెడ్డి,పెదమాం ప్రసాద్,చింతకాయల సైదులు, మన పూరి పురుషోత్తం, శివ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్:** తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి అధికారి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దూడం వెంకటరమణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా దూడం వెంకటరమణ కు వేముల వీరేశం శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమం,చేనేత రంగ అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నార్కట్ పల్లి కేతపల్లి మాజీ జెడ్పీటిసిలు అలుగుబెల్లి రవీందర్ రెడ్డి,కోట మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తుల సంపాదనలో ఉద్యోగులకు ఒక న్యాయం, ప్రజాప్రతినిధులకు ఒక న్యాయమా?

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆదాయానికి మించి ఆస్తులు సంపాదిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే అవినీతి నిరోధకశాఖ అధికారులు పట్టుకుంటారా ఆదాయానికి మించి ఆస్తులు సంపాదిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలను పట్టుకోరా అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా పోటీ చేస్తున్న సందర్భంలో ఉన్న ఆస్తుల వివరాలు, పదవి తరువాత ఎన్ని ఆస్తులయ్యాయో లెక్కించాలని డిమాండ్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు, డబ్బులు సంపాదిస్తే వారి మీద కూడా ఏసీబీ దాడులు చేయాలన్నారు.


















# సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పీడిత కష్టజీవుల హక్కుల సాధనకై తన జీవితాంతం పనిచేసిన తెలంగాణ సాయుధ పోరాటనాయకులు స్వాతంత్ర పోరాట సమరయోధులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కొనసాగిస్తామని సిపిఎం పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం ఆయన 41వ వర్ధంతి కార్యక్రమాన్ని పోచంపల్లి మండల కేంద్రంలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్/నడిగూడెం/ఆలేరు/నకిరేకల్/-మేళ్లచెరువు /కోదాడ/నేరేడుచర్ల /మోటకొండూర్ :** సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కమ్యూనిస్టు ఉద్య మ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

